క్లుప్తంగా

మంచు కురిసే.. మనసు మురిసే



పారిశ్రామిక ప్రాంతంలో చలి తీవ్రత పెరుగుతోంది. తెల్లటి పొగ మంచు తెరలు తెరలుగా కిందికి జారుతున్నట్లు మంగళవారం ఉదయం 6 గంటల సమయంలో జింక్ ఆంజనేయస్వామి ఆలయం సమీపంలో కనిపించింది. ఆ సమయంలో అటుగా వచ్చిన వాహన చోదకులు, పాదచారులు ఆహ్లాదకరంగా ఉన్న ఆ దృశ్యాన్ని చూసి పరవశులయ్యారు.

\- మల్కాపురం

టెలిఫోన్ స్తంభంతో ఇక్కట్లు



రోడ్డు మధ్యలో ఉన్న టెలిఫోన్ స్తంభం

గోపాలపట్నం: జీవీఎంసీ 90వ వార్డు విమాననగర్ లైన్1 ఇరుకు రోడ్డులో అడ్డంగా టెలిఫోన్ స్తంభం ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీన్ని తొలగించాల్సిందిగా స్థానికులు కోరుతున్నారు. ఇక్కడి రోడ్డు చాలా ఇరుకు, దీనికి తోడు మధ్యలో ఈ స్తంభం ఉండటంతో ద్విచక్ర వాహన రాకపోకలకు కూడా ఇక్కట్లు పడుతున్నట్టు చెప్తున్నారు. సంబంధిత అధికా రులు స్పందించి, ఈ స్తంభాన్ని తొలగించా ల్సిందిగా కోరుతున్నారు.

'ఉక్కు' సెగ ఢిల్లీని తాకేలా..



దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న రామకృష్ణ

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు కర్మాగారంపై కేంద్రప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ, ఢిల్లీకి సెగ తాకేలా ఈ నెల 30న ఉక్కు ప్రజాగర్జన నిర్వహించనున్నామని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు తెలిపారు. కార్మికుల ఐక్య ఉద్యమాలతో కేంద్రప్రభుత్వం దిగి రావాల్సిందేనన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో 705వ రోజు మంగళవారం సంస్థలోని డబ్ల్యూ.ఆర్.ఎం–1 మరియు 2 విభాగాల కార్మికులు పాల్గొన్నారు. కార్మికులను ఉద్దేశించి పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, ఎస్.రామారావు, జె.రామకృష్ణ, వరసాల శ్రీనివాసరావు, పరంధామయ్య, చిత్రాడ సన్యాసిరావు, కె.శ్రీనివాసనాయుడు, గుమ్మడి నరేంద్ర, బి.డేవిడ్ తదితరులు ప్రసంగించారు. కార్మికులు చేస్తున్న ఉద్యమాన్ని కేంద్రప్రభుత్వం అణచివేయలేదన్నారు. రాష్ట్ర అభివృద్ధికి విశాఖ ఉక్కు చాలా ముఖ్యమని, దీనిని ప్రైవేటీకరణ చేస్తే ప్రజలందరూ నష్టపోతారని తెలిపారు. లక్షల మందికి అన్నం పెడుతున్న పరిశ్రమను అమ్మేయాలనుకోవడం అత్యంత దుర్మార్గమన్నారు. విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలోనే కొనసాగిస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించే వరకు దీక్షలు కొనసాగిస్తామన్నారు. ఇప్పటికైనా, కేంద్రప్రభుత్వం కార్మికుల మనోభావాలకు విలువనిచ్చి ప్లాంట్ విషయంలో స్పష్టమైన హామీ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో మురళి, బాషా, రాజు ఇతర కార్మికులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరునికి విశేష పూజలు

సింహాచలం : అడవివరంలోని విజినిగిరిపాలెంలో ఉన్న ఉమాచంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో వేంచేసిన వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి మంగళవారం అభిషేకాలు, పూజలు విశేషంగా జరిగాయి. భక్తులు అధికసంఖ్యలో ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ ఈ పూజలను నిర్వహించారు.

వెలవెలబోయిన కార్యాలయాలు



తాళం వేసి ఉన్న ఇంజనీరింగ్ వర్క్స్ కార్యాలయం



60వ వార్డు ఎఫ్‌ఆర్‌యూ ఆస్పత్రిలో బోసిపోయిన ఓపీ విభాగం



జీవీఎంసీ కార్యాలయం ప్రధాన మార్గానికి ఇనుప గ్రిల్స్ వేసి ఉన్న దృశ్యం

మల్కాపురం : జీవీఎంసీలోని పలు కార్యాలయాలకు సంక్రాంతి సెగ వదల్లేదు. సంక్రాంతి ముగిసి రెండు రోజులు కావస్తున్నా.. ఇప్పటికీ చాలా కార్యలయాలకు తాళాలు వేసి ఉన్నాయి. దీంతో ఆయా కార్యలయాలకు వివిధ అవసరాల నిమిత్తం వచ్చే ప్రజలు, ఫిర్యాదుదారులు వెనుదిరగాల్సి వస్తోంది. 60వ వార్డు పరిధి ఎఫ్‌ఆర్‌యు(ప్రభుత్వ ఆస్పత్రి) వెనుక జీవీఎంసీ టౌన్ ప్లానింగ్, ఇంజినీరింగ్ వర్క్స్, విద్యుత్, యూసీడీ విభాగాలున్నాయి. మంగళవారం ఉదయం 11 గంటలు దాటినా.. ఆయా కార్యాలయాల తాళాలు మాత్రం తెరుచుకోలేదు. కారణం ఇక్కడ సిబ్బంది సంక్రాంతి సెలవులకు తమ సొంత ఊళ్లకు వెళ్లటమే. కనుమ పండగ దాటినా.. ఇంకా విధులకు హాజరుకాకపోవడంతో కార్యాలయం ప్రధాన గేటు మూసే ఉంది. అలాగే ఇక్కడ గల 30 పడకల ఆస్పత్రికి వచ్చే రోగుల సంఖ్య కూడా బాగా తగ్గింది. ప్రతి రోజు 30 నుండి 60 వరకు ఓపీ ఉండేది. సంక్రాంతి నుంచి మంగళవారం వరకు కేవలం 5 నుంచి 10కి మాత్రమే పరిమితం అయ్యింది.

ఎక్కడి చెత్త అక్కడే



నాగేంద్ర పాఠశాల సర్వీస్ రోడ్డులో వ్యర్థాలు



బర్మా కాలనీలోని జై దుర్గా ఆలయం సర్వీస్ రోడ్డులో వ్యర్థాలు

- డంపింగ్ యార్డ్‌లుగా మారిన సర్వీస్ రోడ్లు
- దుర్గంధంతో పాదచారుల పాట్లు

మల్కాపురం : 60వ వార్డు పరిధి పలు సర్వీస్ రోడ్లు డంపింగ్ యార్డ్‌లను తలపించే విధంగా ఉన్నాయి. ఇక్కడ రెండు రోజుల నుండి వ్యర్థాలను తొలిగించక పోవటంతో పశువులు, వీధి కుక్కలు చేరి మరింత అపరిశుభ్రం చేస్తున్నాయి. వార్డు పరిధి కొత్త రామాలయం వీధి ప్రాంతంలో నాగేంద్ర పాఠశాలకు ఆనుకుని ఉన్న సర్వీస్ రోడ్డు వద్ద నిర్లక్ష్యంగా వ్యర్థాలను డంప్ చేస్తున్నారు. నలుగురు నడిచే దారిలో వ్యర్థాలను డంప్ చేయటంతో ఆ మార్గాన వాహనచోదకులు, పాదచారులు రాకపోకలు సాగించలేని పరిస్థితి నెలకొంది. ఇక్కడ పెరుకుపోయిన వ్యర్థాలను రెండు రోజుల నుండి తొలగించకపోవటంతో డంపింగ్ యార్డ్‌ను తలపించే విధంగా మారింది. అలాగే ఇదే వార్డులో బర్మా కాలనీ వద్ద జైదుర్గా ఆలయానికి సమీపాన నిర్లక్ష్యంగా వ్యర్థాలను డంప్ చేస్తున్నారు. ఇక్కడ కూడా రెండు రోజుల నుండి వ్యర్థాలను తొలగించకపోవటంతో ఈ పరిసరాలు అపరిశుభ్రంగా తయారయ్యాయి. అధికారులు దృష్టి సారించి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

గణేష్‌నగర్ గెడ్డ.. అపారిశుధ్యానికి అడ్డా

- పూడికతో నిండిపోయిన డ్రైనేజ్
- పట్టించుకోని పారిశుధ్య సిబ్బంది



పూడికతో పేరుకుపోయిన గణేష్‌నగర్ గెడ్డ

గోపాలపట్నం: పారిశుధ్య సిబ్బంది పని తీరు చాలా దారుణంగా ఉందని గణేష్‌నగర్ వాసులు వాపోతున్నారు. ఇక్కడి గెడ్డ వైపు పారిశుధ్య కార్మికులు చూసి ఎన్నాళ్లయిందోనని ఆక్షేపిస్తున్నారు. భారీ వర్షం కురిసి, ఆ వరద నీరుతో కాలువల్లో పూడికలు కొట్టుకుపోవాలి తప్ప, అది తమ పని కాదంటూ.. మీనమేషాలు లెక్కిస్తున్నారని ఎద్దేవా చేస్తున్నారు. జీవీఎంసీ 52వ వార్డు గణేష్‌నగర్ ప్రధాన గెడ్డ దుస్థితి స్థానికులను తీవ్ర ఇబ్బంది పెడుతోంది. గెడ్డలో ఎక్కడ చూసినా పూడికలే. పారిశుధ్య సిబ్బంది కొన్ని ఏళ్లుగా ఈ గెడ్డ వైపు కన్నెత్తి చూసినట్లుగా లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. పూడికలు పేరుకుపోవడంతో గెడ్డ నుంచి తీవ్ర దుర్వాసన వెదజల్లుతోందని, దీనికి తోడు దోమలు, పురుగులు, పందుల బెడద కూడా పెరిగిపోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బీఆర్‌టీఎస్ రహదారి నుంచి రైల్వే లైన్ వరకు చెత్త చెదారాలు, చెట్ల కొమ్మలు వంటివి ఈ గెడ్డలోనే వేస్తుండడంతో పరిస్థితి దారుణంగా మారింది. పారిశుధ్య అధికారులు కూడా చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. వర్షం పడితే ఈ పూడికలు కొట్టుకు పోతా యిలే అన్నట్టుగా సిబ్బంది వ్యవహరిస్తున్నా రని ఆక్షేపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గెడ్డలో పూడికలు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

జ్యోతిబసుకు ఘన నివాళి



జ్యోతిబసు చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న సీపీఐఎం నాయకులు

సీతమ్మధార : పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి జ్యోతిబసు మార్గమే ఈ దేశానికి దిక్సూచి అని సీపీఐఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు లోకనాథం అన్నారు. జ్యోతిబసు 13వ వర్ధంతి సభ మంగళవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం ఆవరణలో నిర్వహించారు. జ్యోతిబసు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాతల్లో ఒకరైన కామ్రేడ్ జ్యోతిబసు కమ్యూనిస్టు పార్టీని బలోపేతం చేయడానికి కీలక పాత్ర వహించారని అన్నారు. కలకత్తా రైల్వే కార్మికుల యూనియన్ నాయకుడిగా బాధ్యతగా వ్యవహరించి కార్మికుల హక్కుల కోసం అనేక సమ్మెలు, పోరాటాలు చేశారని అన్నారు. 23 ఏళ్ల పాటు సుదీర్ఘకాలం పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రిగా జ్యోతిబసు బాధ్యతలు స్వీకరించి ప్రపంచ రికార్డు సృష్టించారని అన్నారు.

పబ్లిక్ డిమాండ్

తాగునీరు వృథా



గౌరీనగర్‌లో వృథాగా పోతున్న మంచినీరు

కంచరపాలెం: స్థానిక 56, 57 వార్డుల పరిధి కంచరపాలెంలో గల గౌరీనగర్, గోకుల్‌నగర్, తోటవీధి, దుర్గానగర్, గొల్లకంచరపాలెం, సుభాష్‌నగర్, తుమ్మడపాలెంలో జీవీఎంసీ మంచినీటి కుళాయిల నుంచి తాగునీరు వృథాగా పోతోంది. వీధి కుళాయిలకు హెడ్ బిగించకపోవడంతో ఈ సమస్య తలెత్తింది. ఇక్కడ మంచినీటి సరఫరా వేళలు కూడా సక్రమంగా లేవు. ఉదయం, సాయంత్రం వేళల్లో సరఫరా చేస్తే పనులకు వెళ్లే ప్రజలకు నీరు ఉపయోగకరంగా ఉంటుంది. సమయపాలన లేకపోవడంతో తాగునీరు వృథాగా పోతోంది. మంచినీటి విభాగం అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదు. సంబంధిత అధికారులు సమస్యను పరిష్కరించాలి.

\- అశోక్‌కుమార్, గౌరీనగర్, ఊర్వశి కూడలి

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

దాబాగార్డెన్స్: నగరంలోని బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో వెంపలి రాంబాబు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

స్వర్ణోత్సవ సంగమం

అర్ధ శతాబ్దం తరువాత కలుసుకున్న మిత్రబృందం



సందడి చేసిన పూర్వ విద్యార్థులు

దశాబ్దాల నాటి స్నేహ బంధం.. స్మృతుల పరిమళాలు వెదజల్లింది. అపూర్వ సంగమ వేళ పాత మిత్రులను జ్ఞాపకాల దొంతరలు చుట్టుముట్టాయి. ఒకటా.. రెండా.. ఏకంగా 51 సంవత్సరాల అనంతరం కలసిన మిత్రబృందం అ'పూర్వ' కలయికకు వేదికైంది గాజువాకలోని ఓ ఫంక్షన్ హాల్. షిప్‌యార్డులోని గాంధీగ్రామ్ హైస్కూల్ 1970-71 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులంతా మంగళవారం కలుసుకున్నారు. అర్ధశతాబ్దపు తీపి గుర్తులను నెమరువేసుకున్నారు. ఆ రోజుల్లో తమకు చదువు చెప్పిన ఉపాధ్యాయులు రామకృష్ణ, నారాయణరావు, కృష్ణమూర్తి, చిట్టెమ్మను ఘనంగా సత్కరించారు. డబ్ల్యూటీవో కామెంటేటర్ దేవరకొండ రవికాంత్ (జెనీవా), ఈఎన్‌టీ నిపుణుడు డాక్టర్ ఎస్.కె.ఇ.అప్పారావు ప్రత్యేక ఆహ్వానితులుగా విచ్చేసి తమ మిత్రులకు అభినందనలు తెలిపారు. పూర్వ విద్యార్థుల సంఘం కన్వీనర్ మాటూరి శ్రీనివాసరావు, కో-కన్వీనర్ కర్రి పద్మారావు, ప్రతినిధులు పీబీకే ఆనంద్, వెంకటేశ్వరరావు, మళ్ల అన్నపూర్ణ, కాండ్రేగుల త్రినాథ్, సముద్రం, తులసీరావు, ఆడారి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. రోజంతా ముచ్చట్లతో గడిపిన వారంతా జ్ఞాపకాలను పదిలపరుచుకుని, మళ్లీ కలుసుకోవాలంటూ వీడ్కోలు పలికారు.

\- గాజువాక

సమస్యల జెర్క్.. వాకర్స్ పార్క్

- అంధకారంతో ఇబ్బందులు
- కనీస సదుపాయాలు కరవు



వాకింగ్ ట్రాక్‌లో ఒక్క లైటూ వెలగని దృశ్యం



అంధకారం నడుమ వాకింగ్ చేస్తున్న స్థానికులు



వాకింగ్ పార్కు ముఖద్వారం వద్ద అడ్డంగా వాహనాలు, ఫ్లెక్సీలు

మల్కాపురం : ఆరోగ్యం కోసం వాకింగ్‌కు వచ్చే వారు అక్కడ అంధకారం అలుముకోవడంతో సెల్ ఫోన్ల లైట్లు ఆన్ చేసుకుని వాకింగ్ చేయాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. వారం రోజుల నుండి ఇక్కడ లైట్లు వెలగకున్నా అధికారులు స్పందించక పోవటం ఆశ్చర్యకరం. 60వ వార్డు పరిధి గుల్లలపాలెం వుడా కాలనీ వద్ద విశాలమైన ప్రదేశంలో జీవీఎంసీ అధికారులు వాకింగ్, సైక్లిలింగ్ ట్రాక్‌ను ఐదేళ్ల క్రితం ఏర్పాటు చేశారు. సింధియా నుండి జింక్ పరిసర ప్రాంతవాసులు సుమారు వంద మందికి పైగా ఇక్కడ ఉదయం, సాయంత్రం వేళల్లో వాకింగ్, ఫిజికల్ ఎక్సర్‌సైజ్‌లు చేస్తుంటారు. ఇక్కడికి వచ్చే వాకర్ల సౌకర్యార్థం వారికి మంచి నీరు, విశ్రాంతికి బల్లలు, మరుగుదొడ్ల వంటివి గతంలో ఏర్పాటు చేశారు. అయితే ప్రస్తుతం ఇక్కడ వాకర్లు సేద దీరేందుకు సిమెంట్ బల్లలు తప్ప మంచినీటి సౌకర్యం లేదు. మరుగుదొడ్లు అంతంతమాత్రంగా అందుబాటులో ఉన్నాయి. విద్యుత్ ఎల్‌ఈడీ లైట్లు వెలగటం లేదు. ఇలా ఇక్కడ సమస్యలు వేధిస్తున్నాయి. అలాగే పార్కులోకి ప్రవేశిద్దామంటే ముఖద్వారానికి అడ్డంగా వాహనాలు పార్కింగ్ చేయటం, ముఖద్వారం గేటుకు పబ్లిక్ సిటీ బోర్డు (ఫ్లెక్సీలు) ఏర్పాటు చేస్తున్నారు. జీవీఎంసీకి చెందిన ఆస్తిలో ఇతరులు ఫ్లెక్సీలు పెడుతున్నా దీనిపై అధికారులు ఎందుకు స్పందించటం లేదో అర్థం కావటం లేదు. వాకింగ్ పార్కులో చీకటి పడితే చాలు అంధకారం అలుముకోవటంతో ఆకతాయులు, ప్రేమికులకు అడ్డాగా మారుతోంది. ఆకతాయిలు సిగరెట్లు, తినుబండారాల వ్యర్థాలు ఇక్కడ విడిచిపెడుతుంటే, ప్రేమికులు ఇక్కడ గంటల తరబడి కాలక్షేపం చేస్తు ఇబ్బంది కలిగించే విధంగా ప్రవర్తిస్తున్నారని వాకర్స్ ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు వాకింగ్ పార్కులో అలుముకున్న సమస్యలపై స్పందించి న్యాయం చేయాలని వాకర్లు కోరుతున్నారు.

వేడుకగా సీతారాముల తీర్థ మహోత్సవాలు



పూజలందుకుంటున్న సీతారాములు

సబ్బవరం: మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం తీర్థమహోత్సవాలు ఘనంగా జరిగాయి. పరిసర గ్రామ ప్రజలు తీర్థ మహోత్సవాల్లో భాగంగా ఆయా ఆలయాలను సందర్శించి, భక్తి శ్రద్ధలతో పూజించి, వేడుకలను ఉత్సాహంగా తిలకించారు. సబ్బవరం శివారు పెదనాయుడుపాలెం, గొల్లలపాలెం, నారపాడు శివారు బలిజపాలెం, బంగారమ్మపాలెం గ్రామాలలోని సీతారాముల తీర్థమహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామా లలో ప్రజలు పెద్ద ఎత్తున స్వామివారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. బంగారమ్మపాలెంలో స్వామివారి ఆలయం వద్ద నిర్వహించిన చిటికెల భజన, తప్పెటగుళ్ల ఆకట్టుకున్నాయి. బంగారమ్మపాలెం సర్పంచ్ దాడి లావణ్య, గ్రామ పెద్దలు దొడ్డి ప్రకాష్, దాడి కన్నంనాయుడు, కొరిబిల్లి నూకరాజు, పెదనాయుడుపాలెంలో గ్రామ పెద్దలు సబ్బవరపు బుజ్జి, నాగభూషణం, గొర్లి శ్రీను, బలిజపాలెంలో మామిడి కొండాజీ తదితరులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు.

ఉత్సవ వేళ.. కోలాట హేల



శ్రీశక్తి భజన బృందం ప్రదర్శన

- ఆలయాల్లో ఆకట్టుకుంటున్న కోలాట ప్రదర్శనలు
- పరసల్లో ప్రత్యేక ఆకర్షణ
- ఔత్సాహికులకు ఉచిత శిక్షణ

జానపదులతో పెనవేసుకున్న ఆ నృత్యం ఇప్పుడు నగరాలనూ పలకరిస్తోంది. పాటకు తగినట్లుగా పదం కలుపుతూ.. ఉత్సాహంగా సాగే ఆ నర్తనం ప్రతీ మదిని తాకుతోంది. ఆలయాల్లో దేవదేవుని తిరువీధిలో స్వాగత గీతంగా పలుకుతోంది. సంప్రదాయ ఒరవడిని కొనసాగిస్తూ.. పిల్లలను, పెద్దలను అలరిస్తూ కళావైభవాన్ని చాటుతోంది.



గణపతి ఆలయంలో కోలాట ప్రదర్శన



ప్రాక్టీస్ చేస్తున్న హరిహర భజన బృందం

పెదగంట్యాడ: ఉగాది మొదలుకొని సంక్రాంతి వరకు .. వేడుక ఏదైనా, సంబరం ఎక్కడైనా కోలాట బృందాలు సందడి చేస్తున్నాయి. లయబద్ధమైన ప్రదర్శనలతో అలరిస్తున్నాయి. ఆలయాల్లోని ప్రతీ వేడుకలో పదం కలిపేలా ఉత్సాహాన్ని నింపుతున్నాయి. పెద్దలతో పాటు చిన్నారులు సైతం ఈ కోలాటంపై ఆసక్తి పెంచుకోవడం విశేషం. జానపద కళారూపాల్లో ఒకటైన ఈ కోలాటం జానపదుల జీవితాలతో పెనవేసుకుపోయి ఒకప్పుడు పల్లెలకే పరిమితమైన ఈ కళ ఇప్పుడు నగరాల్లోనూ విస్తరిస్తోంది. ఈ కళను ప్రచారం చేయడంలోనూ మహిళా లోకం ముందుంటోంది. సరదా కోసం కాదు.. భగవంతుని సేవ కోసమేనంటూ.. భక్తిభావాన్ని పెంపొందిస్తూ వడివడిగా సాగుతోంది.

మువ్వల సవ్వడి.. కోలాట సందడి

వీనుల విందుగా మువ్వల సవ్వడి .. కనులపండువగా కోలాట సందడి వేడుకలకు అదనపు ఆకర్షణగా నిలుస్తోంది. కాలికి గజ్జెలు కట్టి, లయబద్ధమైన అడుగులతో .. చేతిలో కర్రలతో ఆడుతూ సాగే ఈ కోలాటానికి ఇప్పుడు మండలంలో విశేష ఆదరణ లభిస్తోంది. ఒక్కో ప్రాంతంలో ఒక్కో ఆలయం వద్ద కొంతమంది మహిళలు బృందంగా ఏర్పడి ఆలయాల్లో సాయంత్రం సమయాల్లో ఈ కోలాటాన్ని నేర్చుకుంటున్నారు. బృందంలోని సభ్యులందరూ ఒకే రకమైన చీరలు, లంగాఓణీలు కట్టుకుని, అన్నమయ్య కీర్తనలు, భక్తి పాటలకు అనుగుణంగా కోలాటమాడుతూ.. పాదాలు కదుపుతూ ఆకట్టుకుంటున్నారు.

ఉచిత శిక్షణ : ఆలయాల వద్ద మహిళలు కోలాటంలో ఉచిత శిక్షణ ఇస్తున్నారు. నడుపూరు వాసవీ జ్ఞాన మందిరంలో, చిన నడుపూరులోని వంశీకృష్ణ ఆలయంలో, వుడా కాలనీ, గోపాలరెడ్డినగర్, సీతానగరం, నెల్లిముక్కు తదితర ప్రాంతాల్లో ఈ శిక్షణ ఇస్తున్నారు. ఇక్కడ శిక్షణ తీసుకున్న వారు కోలాటంలో ప్రావీణ్యం గడించిన అనంతరం, మరికొందరికి ఈ విద్యను నేర్పిస్తూ ప్రోత్సహించడం విశేషం.

ఘనంగా పెంటమాంబ పరస



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి



అమ్మవారి ఆలయం ఎదుట కోలాటం

పెదగంట్యాడ: గ్రామదేవతల పండగలు సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిబింబిస్తాయని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. మండలంలోని నెల్లిముక్కు గ్రామంలో కొలువుదీరిన పెంటమాంబ అమ్మవారి పరసను మంగళవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, పూజల అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కోలాటాలు, సాముగరిడీలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే నాగిరెడ్డి మాట్లాడుతూ గ్రామాలను చల్లగా చూసే గ్రామదేవతల పండగలను ఏటేటా చేయడం అభినందనీయమన్నారు. అమ్మవారిని నెల్లిముక్కు గ్రామస్తులతో మండలంలోని పెదగంట్యాడ, సీతానగరం, హౌసింగ్ బోర్డ్ కాలనీ, నడుపూరు, బర్మా కాలనీ, డెయిరీ కాలనీ, అయ్యన్నపాలెం తదితర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో పులి వెంకట రమణారెడ్డి, గొందేశి సత్యారావు, గొందేశి వెంకట రమణారెడ్డి, గొందేశి అప్పలరెడ్డి, పులి రాజారెడ్డి, గొందేశి సుమన్, నెల్లి అప్పలరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని పులి భూలోకరెడ్డి విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులర్పించారు.